ప్రజాశక్తి

సోమవారం 14 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బతుకులు బుగ్గి

- కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు
- 8 మంది మృతి, 8 మందికి తీవ్ర గాయాలు
- బాధితులను ఆదుకుంటాం : హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - కోటవురట్ల, నర్సీపట్నం, అనకాపల్లి, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

కైలాసపట్నం గ్రామం వద్దనున్న బాణసంచా ప్రాంతంలో శవాల దిబ్బలు. ప్రమాద స్థలికి కొన్ని మీటర్ల దూరంలో ఎగిరిపడి తునాతునకలైన మృతదేహాలను చూసి కన్నీరు పెట్టనివారు లేరు. ఇంతటి అంతులేని విషాద ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామం వద్దనున్న బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందారు. మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. బాణసంచా తయారీలో జువ్వలకు భారీగా ప్రెజర్ ఇవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

వారంతా కూలీలు. అందులో కొందరు విశాఖ, కాకినాడ వంటి జిల్లాల నుంచి వలసొచ్చి బతుకుతున్నవారు. ఎప్పటిలానే పనిలో నిమగ్నమైన సమయంలో ఒక్క ఉదుటున భారీ పేలుడు. క్షణాల్లో ఆ

కైలాసపట్నం గ్రామం వద్ద శ్రీలక్ష్మి ఫైర్‌వర్క్స్ పేరిట మిగతా 2లో..

పేలుడు ప్రాంతంలో భీతావహ దృశ్యం

క్షతగాత్రున్ని పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

వార్త 2లో..

మాట్లాడుతున్న లోకనాథం, వేదికపై ఆర్.నారాయణమూర్తి తదితరులు

ఉత్తేజపూరితం..

రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

- ప్రస్తుత పాలకుల విధానాలతో ప్రజలకు తీవ్ర నష్టం : సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి
- అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటాలు : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

వక్ఫ్ సవరణలపై భారీ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వక్ఫ్ చట్ట సవరణలను ఖండిస్తూ విశాఖ నగరంలో ఆదివారం ముస్లిములు భారీ ర్యాలీ నిర్వహించారు. డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం జంక్షన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మత పెద్దలు, నాయకులు మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన మిగతా 2లో..

24న భవన నిర్మాణ కార్మికుల ధర్నాలు

వార్త 2లో..

పాడేరు ఘాట్ రోడ్డులో ప్రమాదం

వార్త 3లో..

నవ ధాన్యాలతో ఆదాయం

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

పేలుడు సంభవించిన ప్రాంతమిదే..

బతుకులు బుగ్గి

బాణసంచా తయారీ కేంద్రం 30 ఏళ్లుగా నడుస్తోంది. సుమారు 30 మంది దీనిలో కూలీలుగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం వారంతా పనిలో నిమగ్నమైన సమయంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామస్తులు అప్పికొండ తాతబ్బాయి, పురం పాప, గుంపిన వేణుబాబు, రాజుపేటకు చెందిన సంక్రాంతి గోవింద, దాడి రామలక్ష్మి, చౌడువాడకు చెందిన సేనాపతి బాబూరావు, విశాఖపట్నానికి చెందిన మనోహర్, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన దేవర నిర్మల మృతిచెందారు. జల్లూరి నాగరాజు, వెల్లంకి సంతోషి, మడగల జానకిరామ్, వెల్లంకి సాహూ, వెల్లంగి రాజు, సింహాద్రి గోవింద, సేనాపతి శ్రీను, గుంపిన సూరిబాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా కోటవురట్ల మండలం కైలాసపట్నం, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందినవారు. గాయపడిన వారిలో శ్రీలక్ష్మి ఫైర్‌వర్క్స్ నిర్వాహకుడు మడగల జానకిరామ్ ఉన్నారు. ఆయన రేకుల షెడ్డులోనే ఈ ఫైర్ వర్క్స్‌ను నిర్వహిస్తున్నాడు. క్షతగాత్రులను తొలుత నర్సీపట్నం ఆసుపత్రికి, ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. వారిని హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షలను ప్రభుత్వపరంగా ఎక్స్‌గ్రేషియో కింద ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని, క్షతగాత్రులకు ప్రమాద తీవ్రతను బట్టి రూ.10 నుంచి రూ.25 లక్షలు ఇవ్వాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు.

బాధిత కుటుబాలను ఆదుకోవాలి : సిపిఎం

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుతో మృతిచెందిన, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఘటనపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సామర్లకోట, విశాఖ వంటి ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కార్మికులు తాజా ఘటనలో విగత జీవులుగా మారారని పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పేలుడుతో ఒక్కసారిగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని తెలిపారు. జిల్లాలో తరుచూ పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమౌతున్నారని తెలిపారు. బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి భద్రతా లోపాలు ఉన్నచోట వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

వక్ఫ్ సవరణలపై భారీ ర్యాలీ

వక్ఫ్ సవరణ బిల్లులో లోపాలున్నాయన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు దీన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీలో సుప్రీంకోర్టు న్యాయవాది ఎంజిఎం.ఖాన్, ముస్లిం పెద్దలు డాక్టర్ జహిర్ అహమ్మద్, ఐహెచ్.ఫరూకి, రహమతుల్లా బేగ్, ఎస్‌కె.మునీర్, ఆల్ మాస్క్ అధ్యక్షులు హాజీ అహమదుల్ల ఖాన్, దేవరకొండ మార్కండేయులు (మొహమ్మద్ ఇబ్రహీం), షరీఫ్, ఎస్‌కె.మునీర్, మగబుల్ పాల్గొన్నారు.

'ట్రంప్ వాణిజ్య యుద్ధం - భారత్‌పై ప్రభావం' అంశంపై నేడు సెమినార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సోమవారం సాయంత్రం ఐదు గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'ట్రంప్ వాణిజ్య యుద్ధం - భారత్‌పై ప్రభావం' అనే అంశంపై సెమినార్ జరుగనుంది. ఈ మేరకు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సెమినార్‌కు వక్తలుగా అర్థ శాస్త్ర ఆచార్యులు డాక్టర్ కె.పద్మ, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉత్తేజపూరితం.. రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని కెవిపిఎస్, ప్రజానాట్య మండలి సంయుక్తాధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం అందరిలో ఉత్తేజం నింపింది. తొలుత వందలాది మంది కళాకారులతో నిర్వహించిన కళారూపాల శంఖారావం ఆకట్టుకుంది. ఎల్‌ఐసి కార్యాలయ దరి అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన శంఖారావం ర్యాలీని సినీనటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. డప్పుల వాయిద్యాలు, మహిళల కోలాటం, తీన్మార్‌తో ఈ ప్రదర్శన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, బాటా జంక్షన్ మీదుగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సమ్మేళన సభలో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో భారత రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్న పాలకులు ఉన్నారని, వారి విధానాల వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముమ్ముందు ఇది మరింత తీవ్రం కానుందన్నారు. ఈ పరిస్థితులలో దేశ ప్రజల అందరి క్షేమం కోరే భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రశ్నించేవారిపై దాడులకు పాల్పడుతోందని తెలిపారు. కార్మిక చట్టాలను ఇష్టానుసారం మార్చేస్తోందన్నారు. నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని తెలిపారు. మోడీ పాలనలో భారత రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందన్నారు. రాజ్యాంగం ఉంటేనే ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చెప్పిన విధంగా ప్రజలను సమీకరించడం, బోధించడం, పోరాడటం చేయవలసిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనువాదుల చేతుల్లో పెట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేశంలో నేడు వంద కోట్ల మందికి కొనుగోలు శక్తి లేకుండా పోయిందన్నారు. భారతదేశాన్ని హిందూ రాజ్యాంగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. ఈ క్రమంలోనే ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు అందులో భాగమేనన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ అంబేద్కర్, హష్మి, పూలే, జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు ఉండాలన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ దేశ ప్రజలపై మతోన్మాదాన్ని బిజెపి ప్రేరేపిస్తోందన్నారు. సభ ప్రారంభంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాజ్యాంగ పీఠిక చదివి సభలో పాల్గొన్న వారందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో కెవిపిఎస్ చేపట్టిన పోరాటాలను తెలియజేశారు.

ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు జి.రమణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి టి.చిరంజీవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, ఉపాధ్యక్షులు వై.రాజు, కె.సత్యనారాయణ, జి.స్టాలిన్, ఎంవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళారూపాల ప్రదర్శన జరిగింది. థింసా నృత్యం, రాజ్యాంగ పరిరక్షణ నాటిక, బాల బాలికల నృత్య ప్రదర్శనలు, మహిళా కోలాటాలు, బృంద, దేశభక్తి గేయాల ఆలాపన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కళా ప్రదర్శనలో అంబేద్కర్ వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులందరికీ ఆర్.నారాయణమూర్తి, కె.లోకనాథం, ఆండ్ర మాల్యాద్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

24న భవన నిర్మాణ కార్మికుల ధర్నాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు తెలిపారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు పి.అనసూయ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు డబ్బులను గత, ప్రస్తుత ప్రభుత్వాలు పక్కదారి పట్టించాయన్నారు. కార్మికులకు రావాల్సిన సౌకర్యాలను నిలిపివేయడం దుర్మార్గమన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు బహుళ ప్రయోజనాలు అందుతుంటే మన రాష్ట్రంలో పరిస్థితి దానికి భిన్నంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీనిచ్చి నేడు పట్టించుకోవడం లేదన్నారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మే 20న తలపెట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు బలివాడ వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జి.పోలేశ్వరరావు, రామనాయుడు, కె.నర్సింగరావు, పెంటారావు, రాజశేఖర్, సన్యాసిరావు, చంద్రమౌళి, రమణ పాల్గొన్నారు.

నవ ధాన్యాలతో ఆదాయం

- జిల్లాలో 270 రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ
- 43 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- 'ప్రజాశక్తి'తో ఎపి సిఎన్‌ఎఫ్ అనకాపల్లి జిల్లా మేనేజర్ లచ్చన్న

ప్రజాశక్తి - అనకాపల్లి

నవ ధాన్యాలతో రైతులకు ఆదాయం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ లచ్చన్న తెలిపారు. దేశంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, ఆదాయం పొందాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదలకు కృషి చేస్తున్నాయని వెల్లడించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అమలు తీరును, నవ ధాన్యాల సాగును ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

2025 - 26 ఆర్థిక సంవత్సరంలో ఎపి సిఎన్‌ఎఫ్ చేపడుతున్న కార్యక్రమాలేంటి ?

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ద్వారా 30 రకాల నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సుమారు రూ.1200 విలువైన ఒక్కో ప్యాకెట్‌లో 12 కేజీల కిట్లను రైతులకు సరఫరా చేసేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేశాం.

నవ ధాన్య విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందా ?

ప్రభుత్వం నవధాన్యాల కోసం రైతులకు ఎటువంటి రాయితీ ఇవ్వడం లేదు. రైతులు డబ్బులు చెల్లించి ఆ విత్తనాలు తీసుకోవాలి.

జిల్లాలో ఎన్ని గ్రామాల్లో అమలు చేస్తున్నారు ?

అనకాపల్లి జిల్లాలో ఐదు సంవత్సరాలుగా ఎపి సిఎన్‌ఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. అందులో భాగంగా ప్రీ మాన్సూన్ డ్రైసోయింగ్ ద్వారా 45 వేల మంది రైతులు 43 వేల ఎకరాల్లో వేసేందుకు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నాం. మే చివరి వారంలో రైతులు ఈ విత్తనాలను భూముల్లో వేసుకునే అలవాటు ఉంది. ప్రధాన పంటల ఆధారంగా ఈ నవధాన్యాల విత్తనాలను రైతులకు సరఫరా చేస్తున్నాం.

ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల సహకారం తీసుకుంటున్నారా ?

నాన్ ఎపి సిఎన్‌ఎఫ్ గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ సంస్థలు, సెర్ప్ సహకారంతో నవ ధాన్యాలను జిల్లాలో 165 గ్రామ పంచాయతీలు, 207 రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి వంద శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చాలని ఆదేశాలు ఇచ్చాం. ఇప్పటికే ఈ గ్రామాలకు సంబంధించిన అధికారులకు మండల స్థాయి కన్వర్జెన్సీ, విలేజ్ స్థాయి కన్వర్జెన్సీ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రణాళిక సిద్ధం చేశాం.

ఇంకా రైతులకు ఎటువంటి సహకారం అందిస్తున్నారు ?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయం వైపునకు రైతులను ఆకర్షించేందుకు నవ ధాన్య విత్తనాలతో పాటు అనేక ఉపకరణాలను అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశాయి. దేశంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంతో పాటు పంట పండించే రైతులకు ఆదాయం చేకూరాలనే ఉద్దేశంతో అవగాహన కల్పిస్తున్నాం. కోవిడ్ తర్వాత నాణ్యమైన ఉత్పత్తులపై దృష్టి సారించాం.

పాడేరు ఘాట్ రోడ్డులో ప్రమాదం

- లోయలోకి దూసుకుపోయిన వాహనం
- 18 మందికి గాయాలు
- మాడుగుల, అనకాపల్లి ఆసుపత్రులకు తరలింపు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి- మాడుగుల: జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకుని వలస పోతున్న కూలీలు ప్రయాణిస్తున్న బొలెరా వాహనం ప్రమాదానికి గురై 18 మంది కి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి క్షతగాత్రులు కొంతమంది అందించిన వివరాలివి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా కొత్తవలస, సిద్దల మామిడి, బొడ్డ గూడ, రాళ్లగెడ్డ గ్రామాలకు చెందిన 18 మంది కూలీలు తెలంగాణ రాష్ట్రంలో కూలీ పనులు చేసుకునేందుకు ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం బయలుదేరారు. ఆ బొలెరా వాహనంపై ఒరిస్సా నుంచి వస్తూ పాడేరు ఘాట్‌రోడ్డులో కోమాలమ్మ పనుకు ఏసుప్రభు మలుపు వద్ద వచ్చేసరికి అర్ధరాత్రి సమయంలో బొలెరా వాహనానికి బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలోకి దూసుకుపోయింది. దీంతో గాయాలు పాలైన వారంతా పెద్దగా కేకలు వేయడంతో ద్విచక్ర వాహనదారులు గమనించి మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమా చారం అందించారు., అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని లోయలో పడి ఉన్న క్షతగాత్రులను ఒడ్డుకు తీసుకుని వచ్చారు. అగ్నిమాపక వాహనంలోకి ఎక్కించి మాడుగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న మామిడి అప్పారావు, గుంట కాయేస్, డిప్ప తిరుపతి, కొర్ర రామ్, గుంత లైకోన్, అబినాయక్, కొంతల్, గుంట జంబోలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.మిగిలిన గెమ్మెల శ్రీదేవి, సునీత, కొర్ర షగంది, రాధా, షణ్ముఖుడు, రంజిత్, మనోజ్, పింగల్, లైమతి, లైక్ కొన్ మూర్తిలకు స్వల్ప గాయాలు కావడంతో మాడుగుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ నారాయణరావుకు సంప్రదించగా పాడేరు పరిధిలో ప్రమాదం జరిగిందని, పాడేరు పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర పోస్టులు - యువకునికి రిమాండ్

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి పట్టణ పరిధిలోని రామనగర్ నివాసముంటున్న ఒక యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర పోస్టులు పెట్టిన ఎస్ రాయవరం మండలం ద్వారపూడికి చెందిన యువకుడు నందేశ్వరరావును శనివారం అరెస్టు చేసినట్లు సిఐ.ధనుంజరావు తెలిపారు. నిందితుడిని మేజిస్ట్రేటు ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు ఎవరు పెట్టినా శిక్షార్హులేనన్నారు.

శ్రీ నవోదయ కాలేజీ భవనాన్నిప్రారంభిస్తున్న విష్ణుకుమార్‌రాజు

శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లో శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. తక్కువ ఫీజులతో బోధన అందిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. కాలేజీ కరస్పాండెంట్ బీశెట్టి రాము మాట్లాడుతూ, 2014లో కాలేజీని ప్రారంభించి నేటికీ దిగ్విజయంగా నడిపిస్తున్నామని తెలిపారు. ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్మీడియట్, నీట్, ఎంసెట్ కోర్సులతో బోధన అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ డీన్ మురళి, ప్రసాద్‌వర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రకృతి వ్యవసాయంలో మహిళా రైతులు భాగస్వామి కావడం అభినందనీయమని ప్రకృతి వ్యవసాయాధికారి మోహనరావు పేర్కొన్నారు. ఆనందపురం మండలం పాలవలస గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులు కుమారి, పాలవలస సత్యంలను గ్రామ పెద్దలు, ప్రకృతి వ్యవసాయ అధికారి మోహనరావు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడి తగ్గి ఎక్కువ ఆదాయం రావడంతో పాటు భూమి ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ, తగాదాలు, సెటిల్‌మెంట్లలో తలదూరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి వైసిపికి గిట్టదు

ప్రజాశక్తి- గోపాలపట్నం : అభివృద్ధి, సంక్షేమం అంటే వైసిపికి గిట్టదని ప్రభుత్వ విప్ గణబాబు విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోవులు చనిపోయాయని, పోస్టుమార్టం చెయ్యడం లేదని భూమణ కరుణాకర రెడ్డి ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. సహజంగా గోవులు వృద్ధాప్యంతో మరణిస్తుంటే దాన్ని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

టిడిపి సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గండిగుండంలో బూత్ నెంబర్లు 64, 65లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు స్వామినాయుడు, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ పంపిణీ చేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్స్యూరెన్స్ సౌకర్యం ఉందని సోంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగ ముత్యాలు, శివ, సియాద్రి సతీష్, మమన శ్రీను, ఎలుబంటి కృష్ణ, సబ్బవరపు శ్రీను, మద పాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కులో పలు రకాల జింక కూనలు జననం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో వివిధ జాతులకు చెందిన జింకలకు కూనలు జన్మించాయి. ఒక మౌస్ డీర్, రెండు బార్కింగ్ డీర్, మూడు నీల్‌ఘై, ఐదు సాంబార్ డీర్, ఏడు స్పాటెడ్ డీర్, తొమ్మిది బ్లాక్ బక్స్ జన్మించడం చాలా సంతోషంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అంకితభాంతో కూడిన జూ సిబ్బంది కృషి, జంతు సంరక్షణ, సంతానోత్పత్తి కార్యక్రమాల్లో సిబ్బంది నైపుణ్యం ఈ విజయానికి కారణమన్నారు. ప్రస్తుతం ఈ కొత్త కూనలను సురక్షితమైన, సహజమైన ఆవాసాల్లో సంరక్షిస్తున్నట్టు తెలిపారు. జూ సందర్శకులు త్వరలో ఈ అందమైన కొత్త నేస్తాలను చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

విశాఖ జూ పార్కులో సంతానోత్పత్తి వాటి పరిరక్షణ కొనసాగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అంతరించి పోతున్న రేసు కుక్కల పిల్లల జననం, అడవి దున్నకు దూడ ఇటీవల జన్మించడం ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో చోటు చేసుకుంది.



పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న సిఐ

ప్రజాశక్తి -భీమునిపట్నం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ కాలనీలో సుమారు వంద మంది జివిఎంసి ఒకటో జోన్ మహిళా పారిశుధ్య కార్మికులకు ఆదివారం చీరలు పంపిణీచేశారు. టిడిపి నాయకులు కొప్పల రమేష్, జనసేన నాయకులు పరిమి భువనేశ్వరి, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి గోడి.నాగేశ్వరరావు దంపతులు ఆర్థిక సాయంతో సమకూర్చిన చీరలను సిఐ బి.తిరుమల రావు అందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అత్యంత బలమైనది, దృఢమైనదని చెప్పారు. ఆయన నవ యుగ వైతాళికుడన్నారు. కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, నేడు అమలవుతున్న విద్యా వ్యవస్థలో డార్విన్ సిద్ధాంతం, స్వాతంత్ర్య పోరాట యోధుల పాఠాలు లేవని అవేదన వ్యక్తం చేశారు. సామాజిక ఆలోచనలు కలిగిన వారు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు మాట్లాడుతూ, ప్రస్తుత పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను ప్రైవేట్ పరం చేస్తుండడంతో రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్లు నేడు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, వైసిపి నాయకులు అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : లయన్స్ క్లబ్‌కు 2025-26 సంవత్సరానికి సంబంధించి జరిగిన ఎన్నికలలో సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్‌గా నున్న శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ 44వ జిల్లా మహాసభలు ఈనెల 12 13వ తేదీల్లో గాజువాక క్లబ్‌లో జరిగాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి లయన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. ఆదివారం ముగింపు సందర్భంగా లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్‌విబిఎస్ఎస్.ప్రసాద్ గత ఏడాది నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోటేశ్వరరావు, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి బలివాడ సత్యారావు, ఆలపాటి సుబ్బారావు, ఎంఎల్‌కెఎన్.అచ్యుతరావు, సీనియర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ సమస్యపై.. రైతులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో సర్వేనెంబర్ 1లో ప్రైవేట్ కంపెనీ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా చేస్తున్న భూసేకరణలో రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మజ్జి వెంకటరావు ఆధ్వర్యాన స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు రైతులు వినతిపత్రం అందించారు. కొంతమంది రైతులు పేర్లు నమోదు చేశారని, ఇంకొంతమందివి నమోదు చేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత 40 సంవత్సరాల నుంచి అనుభవంలో ఉండి ఫలసాయం పొందుతున్న సుమారు 30 మంది రైతులకు న్యాయం చేయాలని మజ్జి వెంకటరావు కోరారు. దీనిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ రైతులకు తగు న్యాయం చేస్తాననిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోరాడ ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహార యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-వేపగుంట : జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 9 తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 100 మందిని 25 పాఠశాలలనుంచి ఎంపిక చేసి, గైడ్ ఉపాధ్యాయులు 20 మంది సహకారంతో రెండు బస్సులలో విశాఖపట్నంలో ఉన్న ప్రాముఖ్యత ప్రదేశాలను చూపించే విజ్ఞాన విహార, అధ్యయన యాత్రను ఆదివారం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ పచ్చ జండా ఊపి ప్రారంభించారు. వీరిలో నరవ ఉన్నత పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ యాత్ర ముందుగా కైలాసగిరి వెళ్లింది. తెలుగు మ్యూజియాన్ని విద్యార్థులు సందర్శించి కవులు, వారి గొప్పతనం గురించి తెలుసుకున్నారు. అనంతరం విశాఖ మ్యూజియం, కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం, టి 142 యుద్ధ విమాన మ్యూజియం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గల వివిధ విభాగాలను విద్యార్థులకు చూపించి వాటి ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కప్పల ప్రసాద్, గిరి వరప్రసాద్, బాబూరావు, పి.రాజారావు, ఎంవి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రాంతాల్లో క్లీనింగ్

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పద్మనాభం, పాండ్రంగి గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, చెత్తను ఆదివారం రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన తొలగించారు. రవికుమార్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు

ఎండలోనే ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -గాజువాక : ఏప్రిల్ నెల రావడంతో ఎండలు ప్రభావం పెరిగింది. ఇటీవల గాజువాకలో ఉష్ణోగ్రతలు తీవ్రమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే పాత గాజువాకలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిలబడలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. విశాఖ నగరం వైపు వెళ్లాలంటే పాత అమరావతి హోటల్ దగ్గర బస్ స్టాప్ ఉండేది. అక్కడ బస్ షెల్టర్ ఉండేది. బస్సులు ఏ సమయానికి వచ్చినా అక్కడ కూర్చునే వారు. బస్సు వచ్చాక ఎక్కి విశాఖ నగరం వైపు వెళ్లేవారు. గాజువాక పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో బస్టాప్ వెనక ఉన్న షాప్ యజమానులు వారి పలుకుబడిని ఉపయోగించి బస్సు షెల్టర్‌ను తొలగించారు. 2018వ సంవత్సరం వరకు పాత గాజువాక జంక్షన్ నుంచి కొత్త గాజువాక రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు మూడు బస్ స్టాప్‌ల్లో షెల్టర్లు ఉండేవి. ఇప్పుడు ఒక్క షెల్టర్ కూడా లేకుండా తొలగించారు. మొత్తం షాపులు ఉండటంతో వారికి అడ్డుగా ఉన్నాయని తొలగించారు. దీంతో ప్రయాణికులు, స్కూలు, కాలేజీ పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండలను తట్టుకుంటూ, వర్షం వస్తే తడుస్తూ ఆరు బయటే బస్టాపులో నిలబడి ఉంటున్నారు. శ్రీనగర్ జంక్షన్ వద్ద ఉన్న బస్టు షెల్టర్‌ను కూడా తొలగించడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఒక వృద్ధురాలు ఎండవేడికి తట్టుకోలేక శ్రీనగర్ జంక్షన్ దగ్గర రోడ్డు మీదే పడిపోయింది. ఈ విధమైన ఘటనలు జరుగుతున్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తునానరు. వైసిపి ప్రభుత్వ హయాంలో విశాఖ నగరంతో పాటు అగనంపూడిలో బస్ షెల్టర్లు నిర్మించారు. కానీ గాజువాక ప్రధాన జంక్షన్లో నిర్మించకపోవడాన్ని చూస్తే వ్యాపారస్తుల పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాత గాజువాక జంక్షన్‌లో బస్సు షెల్టర్ లేక ఎండలోనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అదానీ కార్మికులకు బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అదాని కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు వన్‌టైం సెటిల్మెంట్ కింద రూ.4.50 కోట్ల బకాయిలను గురువారం విడుదల చేసిందని, గత ఏడాది మేలో జరిగిన చర్చల్లో నిర్వాసిత కార్మికులు 499 మందికి ఒక్కొక్కరికి రూ.27 లక్షలు చెల్లించేందుకు పోర్టు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఈ మొత్తాన్ని 60 రోజుల్లోనే చెల్లిస్తామని ప్రకటించిందని వివరించారు. ఒక్కో కార్మికునికి రూ.24.80 లక్షలు చొప్పున చెల్లించారని తెలిపారు. మిగిలిన బకాయిలు రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పుడు రూ.4.50 కోట్లు విడుదల చేసినట్లు జీవో 34 విడుదల చేశారని, రూ.11 కోట్లు బకాయి ఉంటే రూ.4.50 కోట్లు విడుదలచేయడమేమిటని ప్రశ్నించారు. తక్షణమే మొత్తం బకాయిని అందించాలని డిమాండ్‌చేశారు. అంగీకరించిన అమౌంట్ కూడా ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ రావడం దుర్మార్గమన్నారు. రూ.11 కోట్లకు వడ్డీతో సహా ఇవ్వాలని డిమాండ్‌చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న 14 మందికి పూర్తిగా సెటిల్మెంట్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అఖిలపక్ష కార్మిక, రాజకీయ పార్టీలను కలుపుకొని మరో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థులతో డాక్టర్ వి.రామారావు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : గాజువాక ఎంవిఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ వి.రామారావు మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన పూర్వ విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదివిన ఉన్నత స్థానంలో అనేక ప్రాంతాల్లో స్థిరపడ్డ వారిని అభినందించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ సిహెచ్.రామసన్యాసిరావు, ఇన్చార్జి ప్రిన్సిపల్ వి.తేజేశ్వరరావు, టి.మల్లేశ్వరరావు, ఈ.కామేశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-2000 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆనందపురం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. అప్పటి విద్యార్థులు ఎంతో నైతిక విలువలతో నడుచుకునేవారని తెలిపారు. ప్రస్తుతం ప్రాచ్ఛత్య సంస్కృతితో విచ్చలవిడితనం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పిల్లలను ఉన్నతంగా తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు కష్ట కాలంలో సహాయం చేసుకోవడానికి ప్రతిజ్ఞ చేశారు. తమ బ్యాచ్‌లో ఎవరైనా పేదలు ఉంటే వారి పిల్లలకు ఆర్థిక సాయం అందించడానికి ఐక్యంగా పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు సన్యాసిరావు, సోషల్ మాస్టర్ ప్రసాదరావు, సుధాకర్ మాస్టర్ సుమారు 15 మంది ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కోరాడ వెంకటేష్, శినగం రామారావు, మేడిశెట్టి రాంజీ, సియాద్రి అప్పలరాజు, కిలాని అప్పలరాజు, మీసాల అప్పలరాజు, పిన్నింటి సన్యాసిరావు, నిమ్మల అప్పలరాజు ,బంటుబిల్లీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం సచివాలయం పక్కన ఉన్న మదర్సా సల్మాన్ ఫార్సీ, 'ఆవాజ్' మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్ మెమోరియల్ హాస్పిటల్ నుంచి ఎజాజురాంహమాన్ పిల్లలను తనిఖీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సదఫ్ ఖానన్, డాక్టర్ బిలాలల్ రెహమాన్, డాక్టర్ భార్గవ్ తదితరులు పెద్దలకు వైద్య తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో జనాబ్ అబ్దుల్ రెహమాన్, సురేష్, అశ్రఫ్, మొహమ్మద్ అయూబ్, అబ్దుల్ మునీర్ ముషహద్, షైక్ రెహమాన్, షైక్ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 16వ తేదీ నుంచి చేపట్టే నిరవధిక సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం గాజువాకలో ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ కాంటాక్టు కార్మికుల అఖిలపక్ష యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు నమ్మి రమణ మాట్లాడుతూ, 16వ తేదీ నుంచి స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద చేపట్టే నిరవధిక సమ్మెలో కార్మికులందరూ విధులను బహిష్కరించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, మెడికల్ చెకప్ పేరుతో కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. ఏ ఒక్క కార్మికుడినీ తొలగించబోమని హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ సమ్మెకు కొనసాగింపుగా పాత గాజువాకలోను, కలెక్టర్ ఆఫీసు వద్ద వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి లెటర్‌ను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కార్యాలయంలో అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి రవి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి -ములగాడ : అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని 62వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు మజ్జి సోమేష్ కోరారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేష్ మాట్లాడుతూ, ప్రపంచ మేధావి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగిపిల్లి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయదేవి, పంచకర్ల అప్పలరాజు, కుమార్, రవి ,వరహాలు, రాంబాబు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వికలాంగులలో నిరుపేదలకు చీరలు, టీ-షర్టులను పంపిణీ చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంటర్‌లో విద్యార్థుల సత్తా

శ్రీకృష్ణాలో...

ఎంపిసిలో 974 మార్కులు సాధించిన సునీతను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ నరసింగరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల చైర్మన్ బి.నరసింగరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ ఏడాదిలో 21 మంది విద్యార్థులు 900 మార్కులు పైబడి, 48 మంది 850 పైబడి, 61 మంది 800 పైబడి మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎస్.సునీత 1000 మార్కులకు గాను 974 మార్కులు, టి.రాజ్యలక్ష్మి 963, ఎన్.నీలిమ 961, ఎస్.సౌభాగ్య 958, కె.రేవతి 957 మార్కులు సాధించారని తెలిపారు.

మొదటి ఏడాదిలో 20 మంది 400 పైబడి, 45 మంది 350 పైబడి, 65 మంది 300 పైబడి మార్కులు సాధించారని తెలిపారు. వీరిలో బి.ఉషారాణి 470 మార్కులకు గాను 461, బి.ప్రవల్లిక 459, బి.లేఖన 458, ఎ.గీతావర్థిని 452, టి.జగన్‌మోహన్‌రెడ్డి, పి.రాజ్యలక్ష్మి 448 చొప్పున మార్కులు సాధించారని తెలిపారు. వీరందరికీ చైర్మన్ నరసింగరావు, అధ్యాపకులు అభినందించారు.

శ్రీ బాసర ప్రతిభ

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి -తగరపువలస : ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక శ్రీ బాసర జూనియర్ కళాశాల చైర్మన్ పూడి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ ఏడాదిలో కె.ధనలక్ష్మి 988 మార్కులు, ఎం.మేఘన, కె దివ్య, కొయ్య అలేఖ్య, వర్షిణి, పి.ఝాన్సీ 987 చొప్పున, ఎ.రవితేజ, కె.మోహనకృష్ణ 986 చొప్పున మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఎంపిసిలో 900 మార్కులకుపైగా 120 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొదటి ఏడాదిలో అల్లు హాసిని 470 మార్కులకుగాను 465, షేక్ అమీనా 464, పి.భరత్ 487, హాసిని 486 మార్కులు సాధించారని తెలిపారు. 460 మార్కులకుపైగా 14 మంది, 400కు పైగా 128 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. వీరందరినీ కళాశాల చైర్మన్ రమేష్, జోనల్ ప్రిన్సిపల్ వివిడి రమేష్ అభినందించారు.

శశిలో...

ప్రజాశక్తి- తగరపువలస :ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, కార్యదర్శి మేకా క్రాంతి సుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ ఏడాది ఎంపిసిలో 699 మంది విద్యార్థులకు గాను 697 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. 991 మార్కులతో పాటు 985పైన 46 మంది, 980పైన 121 మంది, 950పైన మార్కులు 388 మంది, 900 పైన 578 మంది మార్కులు సాధించారని తెలిపారు. బైపిసిలో 122 మందికి గాను 122 మంది ఉత్తరులయ్యారని తెలిపారు. ఇందులో 988 మార్కులతో పాటు 980పైన 15 మంది, 950పైన 64 మంది, 900పైన 104 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

జూనియర్ ఇంటర్ ఎంపిసి పరీక్షకు హాజరైన 535 మందిలో 525 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 470 మార్కులకుగాను 465 పైన 17 మంది, 460పైన 125 మంది, 450పైన 243 మంది సాధించారని వివరించారు. బైపిసిలో 137 మందికి గాను 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ముంపు ముప్పు!

- ఆవఖండంలో అడ్డగోలు నిర్మాణాలు
- ఆక్రమణలతో కాలువల కనుమరుగు
- నిర్వహణ లేక నిర్వీర్యమౌతున్న గ్రోయిన్లు
- మేలుకోకుంటే నీటిమునక అంచున పట్టణం

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ :అనకాపల్లి ఆవఖండం గర్భంలో అడ్డగోలు నిర్మాణాలతో పంట పొలాలతోపాటు పట్టణానికి ముంపు ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమౌతోంది. ఇప్పటికే ప్రధాన, పిల్ల పంటకాలువల దురాక్రమణలు, వాటి నిర్వహణ బాధ్యతలను చూసే దిక్కులేకపోవడం వంటి కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి, ఇప్పుడు పట్టణీకరణ, రియల్‌భూం నేపథ్యంలో ఆవఖండం గర్భంలోనూ నిర్మాణాలు చేపడుతుండడంతో, వర్షం కురిసినా, వరదలొచ్చినా నీరు మళ్లిపోయే మార్గంలేక, ఏకంగా ముంపుబారిన పడే పరిస్థితి ఉందని అంటున్నారు.

అనకాపల్లిలో ఒకప్పుడు వర్షం వస్తే పట్టణం మీదుగా అధిక నీరంతా ఆవఖండంగా పిలిచే ఆవ గర్భంలోకి నీరు చేరేది. సహజ సిద్ధంగా ఏర్పడిన దీని నుంచి వరద నీరు కొండకర్ల ఆవ మీదుగా బంగాళా ఖాతంలో రాంబిల్లి వద్ద కలుస్తుంది. అందుకే ఇప్పుడు ఆవఖండంలో కడుతున్న నిర్మాణాలపై రాజకీయ నాయకులు ప్రజా పక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా నిర్మాణం జరుగుతుండడంపై ధర్నాలు సైతం చేస్తున్నారు. దీనికి కారణం కూడా లేకపోలేదు. 1990లో బైపాస్ రోడ్డు నిర్మాణం వలనే అప్పుడు వచ్చిన వరదలతో పట్టణం నిండిపోయే స్థితికి చేరింది. ఆ బ్రిడ్జి దగ్గర తవ్వితేనే గాని సమస్య నుంచి గట్టెక్కలేని పరిస్థితి ఆనాటిది. అలాంటి నిర్మాణాలపై ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది అయినా పట్టించుకునే పాపాన పోలేదన్నది వారి వాదన. అనకాపల్లిలో ఇరిగేషన్ శాఖ తీసుకుంటున్న చర్యలపై సందేహాలు వ్యక్తనువుతున్నాయి. అనకాపల్లి పట్టణంలో చెర్లోపల, ఎల్లయ్య, నాగులపల్లి అనే కాలువలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా ఒక్కొక్క కాలువకు 8 పిల్ల కాలువలు ఉండేవి. వీటన్నిటికీ అనుబంధంగా 6500 ఎకరాల ఇరిగేషన్ ల్యాండ్ ఉంది. అయితే ఇప్పుడు ఆ కాలువలు ఎక్కడా కానరావడం లేదు. ఎక్కడకిక్కడ అక్రమ నిర్మాణాలు, చెత్తాచెదారంతో కప్పేస్తున్నారు. పట్టించుకునే అధికారే కనబడటం లేదు. దీంతో కొన్ని భూములు బీడులుగా మారి వ్యవసాయానికి కూడా పనికి రాకుండా పోతున్నాయి. అప్పట్లో పంటకాలువల నిర్వహణకు ఇరిగేషన్ శాఖలో 11 మంది లష్కర్లు ఉండేవారు. ఇప్పుడు ఒక్కరు కూడా లేకపోవడంతో వీటి అలనాపాలనా పట్టించుకునే దిక్కు లేకపోవడం ప్రస్తుత దయనీయ పరిస్థితికి కారణం. పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామీణ ప్రాంతమైన అనకాపల్లిలో నెలకొన్న సాగునీటి సమస్యలపై ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలని పట్టణవాసులతోపాటు రైతులు కోరుతున్నారు.

ఆవఖండ గర్భానికి అడ్డుగా నిర్మాణాలు

సాగునీటి కాలువలు నిర్వీర్యం

సరైన నిర్వహణ లేకపోవడం, ఆక్రమణలతో సాగునీటి కాలువలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయి. రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగింది. ఇప్పటికైనా పట్టించుకోవాలి. తగు చర్యలు చేపట్టాలి.

– గంటా శ్రీరామ్, సిపిఎం మండల కార్యదర్శి

నిస్తేజంగా ఇరిగేషన్ శాఖ

అనకాపల్లి గ్రామీణ వ్యవసాయ ఆధారిత ప్రాంతం. గతంలో ఇక్కడ ఇరిగేషన్ శాఖ సేవలు అద్భుతంగా ఉండేవి. ఇప్పుడు ఆ శాఖ ఉందో, లేదో అర్థం కావడం లేదు. ఒక్క సిబ్బంది లేదు. ఉన్న వారికి స్థానిక సమస్యలపై అవగాహన లేదు.

విల్లూరి రాము,
వ్యవసాయదారుల సంఘం, సెక్రటరీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వడ్డాది కెఎడి జెడ్‌పి హైస్కూల్ 2002–03 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉద్యోగ, వ్యాపారం ఇతరత్రా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 32ఏళ్ల తరువాత తాము చదువుకున్న హైస్కూల్‌లోనే కలుసుకుని, నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. అప్పట్లో తమక విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు, విశ్రాంత ఎంఇఒలు ఎన్.రమణ, ఎం ఏసుదాసు, నాగేశ్వరరావు, ఎస్‌వి సత్యనారాయణ, పాచిల వెంకట రమణ, ఎ.పోలిబాబులను సత్కరించారు. హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

వనజీవి రామయ్యకు నివాళి

పద్మశ్రీ రామయ్యకు నివాళులర్పిస్తున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- అనకపల్లి : స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కెకెవిఎ నారాయణ రావు మాట్లాడుతూ మొక్కల ప్రేమికుడు, ఇంటి పేరునే వనజీవిగా మార్చుకొని, జీవితమంతా మొక్కలు నాటి, పెంచుతూ, కోటిగా పైగా మొక్కల నాటి సరికొత్త చరిత్ర సష్టించి రామయ్య మరణం తీరని లోటన్నాౖఉ. 2017లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారం అందుకున్న వనజీవి రామయ్య తన సామాజిక అటవీ కార్యక్రమాలకు దేశవ్యాప్తం చేసిన సామాజిక కార్యకర్త, గొప్ప పర్యావరణ మిత్రుడు, సంఘ సేవకుడని కొనియాడారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన వనజీవి రామయ్య ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వక్షమిత్ర కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టారు మాట్లాడుతూ వనజీవి రామయ్య ప్రకృతి పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడన్నారు ప్రకృతి ప్రేమికులు అందరికీ రామయ్య ఆదర్శనీయుడన్నారు. అనంతరం రామయ్యకు గ్రీన్ క్లబ్ సభ్యులందరూ జోహార్లు అర్పించారు.కార్యక్రమంలో అనకాపల్లి భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, నయిశెట్టి సత్తిబాబు, పెంటకోట సురేష్ కుమార్, యల్లపు సంతోష్ కుమార్, బీరా వినోద్ కుమార్, రంజిత, వరలక్ష్మి, నీలవేణి, గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- అనకాపల్లి : పర్యావరణ పరిరక్షణ, వేసవిలో పక్షుల సంరక్షణకు గ్రీన్ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రముఖ వైద్యులు కెకెవిఎ.నారాయణ రావు అన్నారు. ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవిలో పక్షులకు ఆహారం నిమిత్తం పార్కుల ఆవరణ, దేవాలయాల్లో ఏర్పాటు చేసేందుకు ధాన్యపు కంకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ 11ఏళ్లుగా గ్రీన్ క్లబ్ పర్యావరణ పరిరక్షణతో పాటు వేసవిలో పక్షులకు తిండి గింజలు, తాగునీరు, గూళ్ళు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, భోగ లింగేశ్వర ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, విశ్రాంత అటవీశాఖ అధికారి వీర వినోద్ కుమార్, పెంటకోట సతీష్, ఎల్లపు సంతోష్, నైశెట్టి సత్తిబాబు, ఉమా శంకర్, శ్రీనివాసరావు, ఆనందు, గంట్ల కృష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘననివాళి

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -మునగపాక: రాజ్యాధికారం దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని నాగులపల్లి సర్పంచ్ జామి చిన్నమ్మలు, అంబేద్కరి జమే పునాది అధ్యక్షులు రాజాన బుజ్జిబాబు, దళిత నాయకులు రేపాక మధుబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నాగులపల్లి గ్రామంలో అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల గడుస్తున్నా నేటికీ వివక్షత పోలేదన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. దళిత నాయకులు మైలపల్లి పోతురాజు ఆధ్వర్యంలో 200 మంది పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిందాడ దేవి, ఉప సర్పంచ్ గోసాల గోవిందరాజు దళిత నాయకులు దూలం బూసి రజు, పల్లా బాబ్జి, కామరాజు ,కారు శాంతి కుమార్, బేల లక్ష్మణరావు, లంబ అర్జున్, అంబేద్కర్ యువజన సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి సంస్థల జోన్ ఇన్‌ఛార్జిగా రవిశంకర్

ప్రజాశక్తి- దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవాసంస్థల జోన్ ఇన్చార్జిగా రవిశంకర్‌ను నియమించినట్లు సంస్థల జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు ఆదివారం అనకాపల్లి ఆర్టీసీ మందిరంలో జరిగిన జిల్లా సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు.. జోన్ లోని దేవరాపల్లి, కోటపాడు, చీడికాడ, సబ్బవరం మండలాల్లోని సత్యసాయి సేవా సంస్థలలో సేవలు చేయాలని సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బా విద్యార్థుల ప్రతిభ

కశింకోట విద్యార్థిని రాజులమ్మ స్టేట్ టాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంటర్మీడియట్ ఫలితాలలో అనకాపల్లి జిల్లా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ఫస్టియర్‌లో 629 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 543 మంది ఉత్తీర్ణత సాధించి 86శాతం ఉత్తీర్ణత రేటు నమోదు చేశారు. ఇంటర్ సెకెండియర్‌లో 572 మంది విద్యార్థులలో 520 మంది ఉత్తీర్ణత సాధించి 91శాతం ఉత్తీర్ణత రేటు సాధించారు. వీరిలో 50 మంది విద్యార్థులు 900 మార్కులు పైగా సాధించడం విశేషం. గతేడాది ఫలితాలతో పోలిస్తే, ఈ విద్యాసంవత్సరంలో 11శాతంమెరుగైన ఫలితాలు సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు.

కె.రాజులమ్మ 983/1000

వీరిలో కశింకోట కెజిబివి విద్యార్థిని కె. రాజులమ్మ ఇంటర్ బైపిసి విభాగంలో 983 మార్కులతో రాష్ట్రంలోని అన్ని కెజిబివి స్కూళ్లలో మొదటి స్థానం సాధించడం గొప్ప ఘనత అన్నారు. సేన్‌షైన్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన రాజులమ్మ, ఈ నెల 15వ తేదీన విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నుంచి అవార్డును అందుకోనుంది.

కేజీబీవీ సాధించిన ప్రగతి పట్ల జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తూ, వారి కృషిని ప్రశంసించారు. డిఇఒ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గిడ్డి అప్పారావునాయుడు 100 శాతం సాధించిన కస్తూర్బా విద్యాలయాలను అభినందించారు.

తేగాడ విద్యార్థుల సత్తా

కశింకోట :మండలంలో తేగాడ కస్తూర్బా విద్యాలయ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిరాని ప్రిన్సిపాల్ డి. చంద్రకళ ఆదివారం తెలిపారు. ఇంటర్ సెకెండియర్ బైపిసి విద్యార్థిని కె.రాజులమ్మ 983 మార్కులు సాధించి, కెజిబివిల్లో రాష్ట్రస్థాయిలోనే టాపర్‌గా నిలిచింది.

ఇంటర్ ఫస్టియర్ బైపిసిలో జి. రమ్య 434, డి.అంజలి 427 మార్కులు సాధించారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులతోపాటు అధ్యాపకులను ప్రిన్సిపల్ చంద్రకళ అభినందించారు.

జి. రమ్య

ఇంటర్ ఫలితాల్లో ప్రణతి ప్రతిభ

ప్రణతి

వడ్డాది : మండలంలోని విజయరామరాజుపేటకు చెందిన దస్తావేజు లేఖరి కుమార్తె శ్రీరంగం హాసిని శ్రీసత్య ప్రణతి ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది.ప్రణతి విశాఖలోని ప్రయివేట్ కాలేజీలో బైపీసీ చదువుతుంది.శనివారం విడుదలైన ఫలితాల్లో ప్రణతికి 983 మార్కులు వచ్చాయి.తల్లి గహిణి కాగా తండ్రి రమేష్ ప్రవేటు డాక్యుమెంట్ రైటర్. తమ కుమార్తె మంచి డాక్టర్ కావాన్నదే తమ కోరిక అని ప్రణతి తల్లిదండ్రులు తెలిపారు. టెన్త్ ఫలితాల్లోనూ అప్పట్లోనూ మంచి మార్కులు సాధించి ప్రణతి గుర్తింపు తెచ్చుకుంది. ప్రణతిని పలువురు అభినందించారు.

ఫ్లైఓవర్ వద్దు.. రింగు రోడ్డు నిర్మించండి

ఎంపీ రమేష్‌ను కలిసి గోడు విన్నవించిన రోడ్డు విస్తరణ బాధితులు

అనకాపల్లి ఎంపిని కలిసిన రోడ్డు విస్తరణ బాధితులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అనకాపల్లి, అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్లు కన్నా రింగురోడ్డు నిర్మాణం చేపట్టాలని రోడ్డు విస్తరణ బాధితులు కోరారు. ఆదివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, బిజెపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ బాధితులు, నిర్వాసితుల సంఘం గౌరవాధ్యక్షులు పల్లి శేషగిరిరావు, అధ్యక్షులు దేశంశెట్టి అప్పలనాయుడు, తదితరులు కలిశారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో కలిగే కష్టనష్టాలను వివరించారు. గతంలో అష్టాపురం జంక్షన్ అచ్యుతాపురంజంక్షన్ కు ఎటువంటి సంబంధం లేకుండా ప్రతిపాదించిన విధంగా రింగురోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. అచ్యుతాపురం జంక్షన్ లో సర్కిల్ ఫార్మ్ చేయాలని, అనకాపల్లి బైపాస్ నుంచి ఎస్ఇజెడ్ ముఖ ద్వారం వరకు 100 అడుగులకు రోడ్డు విస్తరించాలని, నిర్వాసితులందరికీ ఒకేలా న్యాయం చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో లాలం రాము, బండారు కుమార్ గుప్తా, ప్రగడ ప్రకాష్, దేశంశెట్టి కాసుబాబు, పంచదార్ల రవి, సూర్యచంద్ర, భవన యజమానులు పాల్గొన్నారు.

ప్రగడను పరామర్శించిన సీఎం రమేష్

అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యసేవలు పొందుతున్న ఏపి రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును అచ్యుతాపురంలోని తన స్వగృహంలో ఆదివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కలిసి పరామర్శించారు. నాగేశ్వరరావును ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు జనపరెడ్డి నరసింగరావు, మేరుగు బాపు నాయుడు, ఎంపిటిసి నీరుకొండ నర్సింగరావు, క్లస్టర్ ఇన్చార్జి అప్పలనాయుడు, కూనిశెట్టి రమణ, కర్రి రమణ, కర్రి ఆదిబాబు, యరిపిల్లి అజయ్, ధర్మిరెడ్డి రఘు, రాయి శ్రీను, జూనియర్ నాగేశ్వరరావు, బిద్ది తాతాజీ, దేశం శెట్టి ఎల్లయ్య నాయుడు పాల్గొన్నారు

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నేత

ప్రజాశక్తి-సబ్బవరం : నేవల్ డాక్ యార్డ్ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సభ్యులందరూ పనిచేయాలని సంఘం నేతలు పిలుపునిచ్చారు .ఆదివారం మల్లునాయుడుపాలెం గ్రామంలో నేవల్ డాక్ యార్డు ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు ఎం. దాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆదిలక్ష్మి జ్యువలర్స్ అధినేత పి.ఎ.నాయుడు, పి. అనిల్ కుమార్ పాల్గొని సంఘ అభివృద్ధిపై సమీక్షించారు.. అనంతరం సంఘ సభ్యులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు రొంగలి కృష్ణారావు, సలహాదారులు సోర్దపూడి సత్యం, అధ్యక్షులు మేడపాటి దాసుబాబు, ఉపాధ్యక్షులు జి.అచ్యుతరావు, ప్రధాన కార్యదర్శి రావిపల్లి రవి,సహాయ కార్యదర్శి కొల్లి ప్రసాద్, ఆర్.రమణ, కోశాధికారి గొర్లి దేముడు, సిరపరపు హరీష్, కార్యవర్గ సభ్యులు పైల శ్రీరాములు, ఎస్ ఎర్నాయుడు, జి. చిన్నరాము, పి. ఈశ్వరరావు, పి. అచ్చింనాయుడు, ఆర్ గణపతి,

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం పండగ

ఈత మట్టలతో ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో రేమా బ్లెస్సింగ్ చర్చిలో పాస్టర్ వి. కృపారావు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు, గీతాలాపనలు చేశారు. ఈ సందర్భంగా. వి. కుమారి ప్రసంగిస్తూ యెరూషలేము ప్రజలు యేసుక్రీస్తుని తమ వీధుల్లోఎలా ఘనంగా ఊరిగించారో వివరించారు. అమృతపురం పురవీధుల్లో మట్టలతో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో సంఘ సభ్యులు గోటివాడ స్మార్ట్ కుమార్, నవీన్, రమణమ్మ,శారా, అబ్రాహాము, మణి, ఎస్తేర్, సునీత, రజని,లక్ష్మి, దయమణి,డానీ, కుశాంత్, ప్రవల్లిక,ప్రశాంతి, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- మునగపాక: స్థానిక గ్రామీణ యువజన మందిరం నూతన కార్యవర్గం ఎన్నికయింది. యువజన మందిరం ఆవరణలో ఆదివారం కమిటీ సభ్యులతో సమావేశంలో గౌరవాధ్యక్షులుగా సూరిశెట్టి రాము, పెంటకోట సీతారాం నియమితులు కాగా, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఆడారి శ్రీకాంత్, మల్ల జోగారావు, రామ జగన్నాథం, కార్యదర్శి, సహాయ కార్యదర్శిగా ఆడారి సూర్యచంద్ర రామారావు, దాడి అరుణ్‌కుమార్, క్రీడా విభాగం అధ్యక్షునిగా పెంటకోట విజయ్, కోశాధికారిగా ఆడారి లక్ష్మణరావులను కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆడారి గంగ మహేష్, రమణ బాబు, టెక్కలి కొండలరావు, బుద్ద నాగు, పెంటకోట శివ గణేష్, షేక్ నాగూర్, కెవిఎస్ అప్పారావు, ఆడారి సోమశేఖర్ ,కాండ్రేగుల చైతన్య, ఇల్లూరి సోమినాయుడు, టెక్కలి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ యువజన మందిరం నూతన కార్యవర్గ సభ్యులు

మధుమేహ వ్యాధి పట్ల జాగ్రత్తలు అవసరం

మాట్లాడుతున్న డాక్టర్ దివాకర్

ప్రజాశక్తి-.అనకాపల్లి : మధుమేహం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రించే అవకాశం ఉందని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ కాండ్రేగుల దివాకరరావు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో నిర్వహించిన అనకాపల్లి వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో భాగంగా 'మధుమేహవ్యాధి చికిత్స.. నివారణోపాయాలు' అనే అంశంపై డాక్టర్ కాండ్రేగుల దివాకరరావు సభ్యులకు అవగాహన కల్పించారు. మధుమేహ వ్యాధి రావడానికి వయసుతో సంబంధం లేదని, అన్ని వయసుల వారికి వస్తుందన్నారు. భోజనం ఒకేసారి కాకుండా రోజులో ఎక్కువసార్లు కొంచెం కొంచెం తినాలని, నిత్య జీవితంలో నడక అలవాటు చేసుకోవాలని సూచించారుమధుమేహం వచ్చినవారు తగు జాగ్రత్తలు తీసుకోకపోతేకిడ్నీవ్యాధులు, శరీరంలో నిశ్శత్తువ, ఊపిరి తీసుకోలేకపోవడం, ఆయాసం వంటి చిహ్నాలు కనిపిస్తాయని చెప్పారు. క్రొత్త వాకర్స్‌ను సభకు పరిచయం చేసి వారికి వాకర్ పిన్ను, కండువా వేసి సత్కరించారు. అనంతరం డాక్టర్ దివాకర్‌ను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ డిడి నాయుడు, అధ్యక్షులు రాపేటినారాయణ రావు, కార్యదర్శి వై శివ, కోశాధికారి కెటివి. సత్యనారాయణ, చవితిన నరసింగరావు, గౌరీపతి, బి రామకృష్ణ, విల్లూరి శ్రీనివాసరావు, ఆళ్ళ ఓం రామ్, ఆడారి మల్లికార్జున రావు, ఎం. రామారావు, వై సత్యనారాయణ పాల్గొన్నారు.

'బూడి'కి వైసిపి నేతల అభినందన

ముత్యాలనాయుడును అభినందిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - పరవాడ : వైసిపి పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యునిగా నియమితులైన అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు. బూడి ముత్యాలనాయుడును ఆదివారం తరువ గ్రామంలో రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు, పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు, పరవాడ వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, గెంజి సురేష్ తదితరులు. మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైసిపి కమిటీలో నూతనంగా నియమితులైన పిఎస్ రాజు, బంధం నాగేశ్వరరావులను ముత్యాలనాయుడు శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని, సూచించారు.

21న పూలే, అంబేద్కర్ జయంతి సభ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి:భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ. జయంతినిగ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం పిలుపునిచ్చింది. ఈనెల 21న సోమవారం మండల కేంద్రం దేవరాపల్లిలో పూలే, అంబేద్కర్ జయంతోత్సవాల సభను నిర్వహిస్తున్నట్లు మండల కమిటీ అధ్యక్షులు కాటపల్లి అప్పారావు తెలిపారు. ఆదివారం దేవరాపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు పూలే అంబేద్కర్ జయంతోత్సవాల సభకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, దళిత, బహుజన నాయకులు హాజరవుతారన్నారు. మండల సంఘం నాయకులు కార్లి సాయి సుందరరావు, సబ్బవరపు మాలిబాబు, మచ్చా రామారావు, రొప్పల రాజు, సబ్బవరపు కొండలరావు, టి. శ్రీరామ్, వల్లా సంతోష్ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్: ఈదురుగాలులతో ఎక్కడికక్కడ పడిపోయిన విద్యుత్‌స్తంభాలు, వైర్లను సరిచేసి, కరెంట్‌ను యుద్దప్రాతిపదికన విద్యుత్ శాఖ అధికారులు పునరుద్దరించారు. శనివారం ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో విద్యుత్‌సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో రాత్రి వేళల్లో ప్రజలు అవస్థలు పడ్డారు ఆదివారం ఉదయం ట్రాన్స్‌కో ఎడి రామరెడ్డి, ఎఇఇ త్రినాధరావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విరిగిపడ్డ స్తంభాల స్థానే కొత్తవి ఏర్పాటుతోపాటు వైర్లు బిగించి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ ను పునరుద్దరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సి ప్రసాదరావు చొరవతో మరమ్మతులు వేగవంతంగా జరిగాయి.

గవరల సంక్షేమానికి కృషి చేద్దాం

నూతన పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : గవరల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడతోపాటు గవరల సంక్షేమానికి సమిష్టిగా కృషి చేద్దామని సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో గవర జెఎసి ఫౌండర్ కర్రి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం జరిగింది. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొని నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు తీసుకున్న కమిటీ సభ్యులందరూ గవర జాతి అభివృద్ధికి కృషి చేయాలని, గవరల ప్రధాన సమస్యలను తెలుసుకొని తమ దృష్టికి తెస్తే, గవర శాసన సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమం లో డాక్టర్ బిఎం నాయుడు, కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ మహాలక్ష్మి నాయుడు, బుద్ద రమణాజీ, కొణతాల రత్నకుమారి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి గవర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక జాతర, రాష్ట్ర పండుగలో భాగంగా స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. పెరిని నృత్యాలయం, పెరిని కుమారి, సాయి మాస్టర్ విశాఖపట్నం, చిన్నారుల ప్రదర్శనలు భక్తులను కట్టిపడేస్తున్నాయి. ముఖ్య అతిథిలుగా కొండ్రం సర్పంచు నందారావు సూరిబాబు, ప్రముఖ శిల్పి కామదేనవు ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. నెల రోజుల ఉత్సవాలలో పాల్గొనే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జనసేననియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూకాంబిక దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు), ధర్మకర్తలు, రాష్ట్ర గవర వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికష్ణ, నిర్వాహకులు తిమ్మపాత్రుని చక్రవర్తి,సకల గోవిందరావు, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

ప్రత్యేక గిరిజన భూ దర్బార్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొత్తకోట:మైధాన ప్రాంత గిరిజనుల సమస్యలపై నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక గిరిజన భూ దర్బార్ ను ఏర్పాటు చేయాలని 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవింద రావు, గిరిజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం, 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రావికమతం మండలం జెడ్.బెన్నవరం నుంచి అజేయపురం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. కల్యాణపులోవలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలంటినీ 5వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజనులకు రక్షణ కోసం అనేక చట్టాలను రూపొందించారని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో గిరిజనుల సాగులో ఉన్న భూముల నుంచి రెవెన్యూ అధికారుల సహకారంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెళ్లగొడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నర్సీపట్నంలో ప్రత్యేక భూ దర్బార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీవీటీజీ గిరిజన సంఘం నాయకులు వాసు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ చేపడుతున్న నాయకులు

ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండారు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులతో పాటు మండలానికి చెందిన పలు గ్రామాల నుంచి ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. మాడుగుల, ఎం.కోటపాడు, శంకరం పంచాయతీల నుంచి ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి కండువాలు వేశారు. పార్టీ మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, నందారపు సన్యాసిరావు, టౌన్ ప్రెసిడెంట్ రంజిత్ వర్మ పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.20కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటీ 18, 19, 20 వార్డులో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు విజయ్, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, కౌన్సిలర్ రాజేష్‌లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో గత ఆరు రోజులుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఎక్కడా కూడా ఒక్క రూపాయి తీసుకువచ్చి ఈ గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఆలోచన లేదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో బలిఘట్టంలో మూడు వార్డులకు గాను రూ.95 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. నర్సీపట్నంలో ఇండస్ట్రీ తీసుకువచ్చే ఆలోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న విజయ్

చెక్కతో అంబేద్కర్ ప్రతిరూపం

అద్భుతం..అంబేద్కర్ కళారూపం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చెక్కతో 14 అంకె రూపంలో అంబేద్కర్ ప్రతిరూపాన్ని ఆవిష్కరించాడు. పలు పర్వదినాల్లో సూక్ష్మ కళాకారుడు రవి తన కళను ప్రదర్శించడం తెలిసిందే.

ఇంటర్ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామానికి చెందిన ఇరువురు మత్స్యకార విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో సత్తా చాటడంతో గ్రామానికి చెందిన అరుణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు అభినందించారు. అడ్డురోడ్డు గాయత్రీ కాలేజీ విద్యార్థి గరికిన పుష్ప - 461 (ఎంపీసీ), పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థి గరికిన ప్రదీప్ - 428 (ఎంపీసీ) మార్కులు సాధించడంతో అరుణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రసన్న, రాజేష్, జగదీష్, మణికంఠ, శ్రీను, సింహాచలం తదితరులు వీరిద్దరిని అభినందించి, స్వీట్లు తినిపించారు.

స్వీట్లు తినిపిస్తున్న ట్రస్టు సభ్యులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల:ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రతి ఒక్కరు నవధాన్యాలు సాగు చేపట్టాలని జిల్లా ప్రోజెక్టు మేనేజర్ లచ్చన్న అన్నారు. మండలంలోని ముకుందపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలకరి వర్షాలు పడే ముందు నవధాన్యాలు సాగు చేయవచ్చని తెలిపారు. ఈ విధంగా నవధాన్యాలు వేయడంతో ప్రధాన పంటకు ఎటువంటి రసాయన ఎరువులు, పరుగుల మందులు వాడనవసరం లేదన్నారు. ఈ కార్యక్యంలో ఎన్ఎస్ఏ నాగమణి, నాయుడు, దేవి, గండి శ్రీను గ్రామపెద్దలు రైతులు పాల్గొన్నారు.

వివిధ రకాల విత్తనాలు

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కోటవురట్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి కోటవురట్ల: మండల కేంద్రంలో మండల సమావేశం మందిరంలో ఆదివారం ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం నేత గంట్ల శీనుబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రచురించినప్పుడే వాటి పరిష్కారం సాధ్యపడుతుందని అన్నారు, టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు మాట్లాడుతూ, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు దత్తుడు రాజు, డివిజన్ నాయకులు ఈశ్వరరావు, పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

రావికమతం:జర్నలిస్టుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా ఏపీయూడబ్ల్యూజే పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జోగి నాయుడు చంద్రరావులు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాడుగుల ప్రెస్ క్లబ్ సమావేశానికి వీరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అక్రమంగా ఇచ్చిన జీవో ను తమ సంఘ నాయకులు పోరాడి రద్దు చేయించారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ మంజూరులో గత ప్రభుత్వం విధించిన షరతులు రద్దు చేసి పనిచేసే ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వంతో సంప్రదింపులు చేసామన్నారు.అక్రిడేషన్ మంజూరుకు సవరించిన జీవో త్వరలోనే విడుదల కానుందన్నారు. మాడుగుల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్లపు చిన సత్యనారాయణ మాట్లాడుతూ,వర్కింగ్ జర్నలిస్టులకు ప్రత్యేక పింఛను మంజూరు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎస్ రామకోటి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు రొబ్బ శీను, మాడుగుల ప్రెస్ క్లబ్ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి పలు రకాల సమస్యలతో బాధపడుతున్న 420 మంది రోగులు హాజరయ్యారు. వీరిలో 35 మందికి పలు రకాల ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. స్టార్ వన్ అధినేత పేకేటి ప్రసాదు, పులగాయల సత్యనారాయణ, గోవిందు బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పలు విభాగాల వైద్య నిపుణులు రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా స్టార్ వన్ ప్రతినిధి పులగాయల గోవిందు బ్రదర్స్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో గెంజి మోదీ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గంజి వెంకటరమణ, గొంప ఎంపిటిసి గెంజి సూర్యనారాయణ, హై స్కూల్ చైర్మన్ అప్పారావు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ వేపాడ శ్రీను, పులగాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

పేలుడు ఘటనపై స్పీకర్ అయ్యన్న దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆదివారం భారీ పేలుడు ఘటనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణకు ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో అవసరమైన బెడ్లు సిద్ధంగా ఉంచాలని, మెడికల్ సిబ్బంది, మందులు, వెంటిలేటర్లు అందుబాటులో ఉంచాలని ఆసుపత్రి సూపరిం టెండెంట్‌కు సూచించారు.గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. 5 తరగతి ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 2 గంటల నుండి 4.30 వరకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సువర్ణ కుమారి మాట్లాడుతూ 5వ తరగతిలో ప్రవేశాలకు 130 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 103 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 168 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 131 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.

ఎంఎల్‌హెచ్‌పి రమ్యశ్రీ మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెన్నవరం సచివాలయంలో ఎంఎల్‌హెచ్ పి(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవిడర్)గా విధులు నిర్వర్తిస్తున్న గసాడి రమ్యశ్రీ (23) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. గత వారం రోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, రెండు రోజుల క్రితం విశాఖపట్నంలోని చెస్ట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యాధికారులు లక్ష్మీకాంత్, శివప్రసాద్, హెచ్.వి. కృష్ణవేణి సంతాపం వ్యక్తం చేశారు.

భారతరత్న బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి ప్రత్యేకం

నిత్య స్ఫూర్తి..అంబేద్కర్

-నేడు ఆ మహనీయుని జయంతి

- విశాఖలో ఆయన పేరిట పలు ఉద్యమ కేంద్రాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓ స్ఫూర్తి శిఖరం. ఆయన పేరు వింటే చాలు ఓ రకమైన ఉత్తేజం. ఆయన పేరు తలచుకుంటే చాలు తెలియని ఉత్సాహం. కలబడి నిలబడాలన్న తెగువ. ఇంతలా అందరినీ ప్రభావితం చేసిన అంబేద్కర్.. భారతదేశ రాజ్యాంగ నిర్మాత... న్యాయ నిపుణుడు... రాజకీయ నాయకుడు... ఆర్థికవేత్త... మంచి ఉపాధ్యాయుడు... గొప్ప ఉపన్యాసకుడు... ప్రముఖ సంపాదకుడు... ప్రసిద్ధ రచయిత... వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వయంకృషి, స్వీయ ప్రతిభతో ఎంతో ఎత్తుకెదిగిన మహావ్యక్తి. అంటరానితనం, కులతత్వం, సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక అసమానతలు రూపుమాపడానికి తన జీవితాంతం పోరాడిన యోధుడు. సమాజాన్ని మౌలికంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారాలు సూచించిన మేధావి. అందుకే ఆయన అణగారిన వర్గాల ఆశాజ్యోతి... యావజ్జాతికి వైతాళికుడు. నేడు ఆ మహనీయుని జయంతి. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని విశాఖ నగరంలోని ఆయన పేరిట ఉన్న ఉద్యమ కేంద్రాలను ఓసారి జ్ఞప్తికి తెచ్చుకుందాం.

ఎల్ఐసి భవనం సమీపంలోని అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం, ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం ఉద్యమ కేంద్రాలని చెప్పొచ్చు. ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్, బిర్లా కూడలి, రెల్లివీధి జంక్షన్, అల్లిపురం జివిఎంసి పాఠశాల ప్రాంతం, తాటిచెట్ల పాలెం, నెహ్రూ బజార్ ఇలా నగరంలో పలు ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలు ఆకర్షణీయంగా, దళితుల పాలిట ఆశాజ్యోతిగా విరాజిల్లుతున్నాయి. విశాఖ పోర్టుకు సమీపంలో జ్ఞానాపురం వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం నేడు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. అంబేద్కర్ పేరుతో ఉన్న పలు భవనాలు, కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు నగరంలో ఎన్నో ఉన్నాయి. వీటిలో రామాటాకీసు నుంచి సత్యం జంక్షన్‌కు వెళ్లే మార్గంలోని బుల్లయ్య కాలేజీని ఆనుకొని ఉన్న అంబేద్కర్ భవనం ప్రసిద్ధిగాంచినది. విశాలమైన స్థలంలో అతిపెద్ద సైజులో అన్ని సదుపాయాలతో నిర్మించిన ఈ భవనంలో నిత్యం ఏదో ఒక సామాజిక కార్యక్రమం, వివాహాలు వంటి శుభకార్యాలు, సభలు, సమావేశాలు జరుగుతూనే ఉంటాయి.

భారతరాజ్యాంగ నిర్మాత, భారత రత్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
జయంతి శుభాకాంక్షలు
భాగం గోపాలరావు B.A. B.L.
న్యాయవాది, ఉత్తరాంధ్ర దళిత నాయకులు,
మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి,
భీమునిపట్నం. సెల్: 9640296070

భారతరాజ్యాంగ నిర్మాత, భారత రత్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
నీ కోసం జీవిస్తే... నీలోనే నిలిచిపోతావు,
జనం కోసం జీవిస్తే...జనంలో నిలిచి పోతావు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
- మీ..శ్రేయోభిలాషి
BABU NAYAK

భారతరాజ్యాంగ నిర్మాత, భారత రత్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
నీ కోసం జీవిస్తే...
నీలోనే నిలిచిపోతావు,
జనం కోసం జీవిస్తే...
జనంలో నిలిచి పోతావు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
SIDDHARTH AMBEDKAR YELETI M.H.R.M ; LL.B.
Joint Manager-HR, Project Office Kandla
Dredging Corporation of India Ltd

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
మహాపరిపూర్ణుడు, మానవతావాది
నవ భారత్ పునర్ నిర్మాణదార్శినీకుడు
ప్రపంచ మేధావి మన బాబాసాహెబ్
డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
డా॥ జి. అర్జున M.S
Superintendent, Retd.
KGH, Visakhapatnam
జై భీమ్ కల్చరల్ అసోసియేషన్

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
నీ కోసం జీవిస్తే... నీలోనే నిలిచిపోతావు,
జనం కోసం జీవిస్తే...
జనంలో నిలిచి పోతావు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
S. LAKSHMI BAI
Asst. SECRETARY, GAD (Retd.)
VISAKHAPATNAM PORT AUTHORITY

భారతరాజ్యాంగ నిర్మాత, భారత రత్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
నీ కోసం జీవిస్తే...
నీలోనే నిలిచిపోతావు,
జనం కోసం జీవిస్తే...
జనంలో నిలిచి పోతావు
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
Dr. S.SREENIVAS M.D.
Professor of Medicine

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
మహాపరిపూర్ణుడు, మానవతావాది
నవ భారత్ పునర్ నిర్మాణదార్శినీకుడు
మన బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
MECHANICAL OFFICERS OF M & EE DEPARTMENT
Visakhapatnam Port Authority
K.VENU GOPAL - Superintendent Engineer (Mechanical)
M.N.S.S.SINGH - Superintendent Engineer (Mechanical)
M.DEVESWARA RAO - Executive Engineer (Mechanical)
M.S.RAO - Asst. Executive Engineer (Mechanical)
D.NAIDU BABU - Asst. Executive Engineer (Mechanical)
CH.HARAHARI RAO - Asst. Executive Engineer (Mechanical)
P.GNANI - Safety Officer
D.BALAJI - Asst. Executive Engineer (Mechanical)
K.V.RAMANA - Asst. Executive Engineer (Mechanical)

భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
Dr. N.B.VIJAY KUMAR
M.D(Gen. Med.) M.B.A. (Hosp Admin)
NB CLINIC :
Opp. Sagar Lodge, Collector Office Jn., Vizag-2
Timings : 5 P.M. to 9 P.M.
For Appointment, Ph : 8374506888

భారతరత్న బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి శుభాకాంక్షలు
పుట్టుకతో ఎవ్వరూ
గొప్పవారు కాలేరు..
మన ప్రవర్తన, మన చేతలే
మనల్ని గొప్పవారిగా మారుస్తాయి.
- డా॥ బి.ఆర్. అంబేద్కర్
నవభారత నిర్మాత,
రాజ్యాంగ రచనా
సంఘం అధ్యక్షులు
డా॥ బి.ఆర్. అంబేద్కర్
134వ జయంతి
శుభాకాంక్షలు
ఆచార్య యం. ప్రసాదరావు
యం.ఏ., పిహెచ్.డి. (ససెక్స్,యు.కె) బి.యల్.,
పూర్వ విభాగాధిపతి, డిపార్టుమెంట్ ఆఫ్ ఎకనామిక్స్
విశ్రాంతాచార్యులు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్, విశాఖపట్నం - 530003.